క్లుప్తంగా

బొడ్డేటి ప్రసాద్‌కు అభినందనలు



అనకాపల్లి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొడ్డేటి ప్రసాద్‌ను సత్కరిస్తున్న నాయకులు

అల్లిపురం : వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేటి ప్రసాద్‌ను పార్టీ పార్లమెంటరీ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, జేసీజే కన్వీనర్ కర్రి నీలకంఠం, కన్వీనర్ కొడమంచిలి శ్రీను, వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ప్రతినిధి కోరిబిల్లి త్రినాథ్ శనివారం రామ్‌నగర్‌లో గల బొడ్డేటి ప్రసాద్ కార్యాలయానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆయనను అభినందించి సాలువాతో సత్కరించారు. పార్టీలో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.

కవితల పోటీలకు ఆహ్వానం

సీతంపేట: సాహితీ స్రవంతి విశాఖ జిల్లా కార్యదర్శిగా వ్యవహరించిన నూనెల శ్రీనివాస రావు తృతీయ వర్ధంతిని పురస్కరించుకుని అభ్యుదయ కవితలు, మినీ కవితల పోటీ నిర్వహించనున్నట్టు సంస్థ కన్వీనర్ పెంటకోట రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ ఉత్తమ కవితకు రూ.2 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.1,500, తృతీయ బహుమతిగా రూ.1,000 అందిస్తామని చెప్పారు. 82477 97303, 94900 99222 నంబర్లకు వాట్సాప్ ద్వారా గాని, సాహితీ స్రవంతి విశాఖ జీ మెయిల్‌కు గాని ఈ నెల 20లోగా కవితలు పంపించాలని ఆయన కోరారు.

మర్యాదపూర్వక కలయిక



విశాఖ–లీగల్ : సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌వీ భట్టును భారత్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సీనియర్ సభ్యుడు ఎస్.కృష్ణమోహన్ మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే జస్టిస్ వెంకటరమణిని కూడా కృష్ణమోహన్ మర్యాదపూర్వకంగా కలిశారు.

వైభవ వేంకటేశ్వరుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున గొల్లసన్నిధి సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిపారు. మధ్యాహ్నం 200 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 5.30 గంటలకు ఆకాశ దీపారాధన, 7 గంటలకు స్వామికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బందారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అభాగ్యులతో 'మమతా'నుబంధం

కని పెంచిన వారిని, తోబుట్టువులను, ఇరుగు పొరుగును కూడా ప్రేమించలేని సమాజంలో బతుకుతున్న మనం.. అనాథలు, అన్నార్తులను అక్కున చేర్చుకునే వారి గురించి వింటే కాస్త ఆశ్చర్యంగానే ఉంటుంది. అలాంటి సంస్థల్లో మమత చారిటబుల్ ట్రస్ట్ ఒకటి. వ్యక్తుల్లో మమత ఒకరు.

- అన్నార్తులు, అనాథలకు సేవలందిస్తున్న మమత చారిటబుల్ ట్రస్ట్
- చికిత్స అందించి కుటుంబ సభ్యుల చెంతకు చేరుస్తున్న వైనం



వీధి బాలలకు పుస్తకాలు, పెన్సిళ్లు అందజేస్తున్న మమత



పోలీసుల సాయంతో అభాగ్యులను అయిన వారికి అప్పగిస్తున్న మమత

SUNDAY SPECIAL

అల్లిపురం : రెండేళ్ల కిందట నగరంలో ప్రారంభమైన మమత చారిటబుల్ ట్రస్ట్ ఎందరో అభాగ్యులకు నిలువ నీడనిస్తూ.. బతుకుపై వారికి భరోసా కల్పిస్తోంది. పరిమిత సంఖ్యలో ఉన్న దాతల సాయంతో వారికి కావాల్సిన ఆహారం, మందులు తదితర అవసరాలను తీరుస్తోంది. మానసిక వికలాంగులు రోడ్లపై తారసపడితే.. వారిని విశాఖ మానసిక ఆస్పత్రికి తరలిస్తోంది. వారు పూర్తిగా కోలుకున్న తర్వాత కేజీహెచ్‌లోని సేవా వార్డులో చేర్పిస్తోంది. అక్కడ కోలుకున్న బాధితులు తమ వారి గురించి చెప్పగలుగుతారు. అప్పుడు ట్రస్ట్ ఆ వివరాలతో అయిన వారి చెంతకు వారిని చేరుస్తోంది. వివరాలు లభించని పురుషులను ఇండియన్ రెడ్‌క్రాస్ జీవీఎంసీ నిరాశ్రయ వసతి గృహానికి అక్కడి సిబ్బంది సాయంతో, మహిళలను మన కుటుంబం వృద్ధాశ్రమానికి, నడవలేని వారిని పెందుర్తిలోని లయోలా హోంకు తరలిస్తోంది ట్రస్ట్.

పోలీసుల సహకారంతో..

మమత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు ఎల్లేటి మమత అభాగ్యులను ఆశ్రయ గృహాలకు తరలించే సమయంలో పోలీసులు, సీఆర్పీఎఫ్, రక్షక్ నుంచి సాయం తీసుకుంటారు. కొన్నిసార్లు రాత్రి వేళల్లో ఫలానా ప్రాంతంలో ఎవరో అనాథ ఉన్నాడని ఆమెకు సమాచారం వచ్చినప్పుడు.. రక్షక్ సాయంతో అతన్ని నిరాశ్రయ వసతి గృహానికి తరలిస్తుంటారు. వివిధ ప్రాంతాల నుంచి విశాఖకు రైల్లో వచ్చి.. ఎక్కడికి వెళ్లాలో తెలియక రైల్వేస్టేషన్‌లోనే ఉండిపోయే వారిని గుర్తిస్తారు. సీఆర్పీఎఫ్ సిబ్బంది సహకారంతో వారిని వసతి గృహాలకు తరలిస్తుంటారు.

అనాథ పిల్లలకూ సేవలు

రోడ్లపై తిరిగే అభాగ్యులకే కాకుండా అనాథలైన చిన్నారులకు కూడా మమత చారిటబుల్ ట్రస్ట్ సేవలందిస్తోంది. ఆ పిల్లలకు కావాల్సిన పుస్తకాలు, స్కూల్ బ్యాగులను దాతల సహాయంతో సమకూరుస్తోంది. వారికి కావాల్సిన మందులు అందజేస్తోంది.

సేవే పరమావధి



అభాగ్యుల సేవలో ఆనందం ఉంది. చదువుకునే వయసు నుంచే సేవాగుణం అలవడింది. అనాథల సేవలో పోలీసులు, సీఆర్పీఎఫ్, రక్షక్ విభాగాలు సహకరిస్తున్నాయి. కుటుంబ సభ్యుల సహకారంతో సేవే పరమావధిగా ముందుకు సాగుతున్నా. అభాగ్యులను ఆదుకునే క్రమంలో కొన్నిసార్లు నగదు అవసరం ఏర్పడుతుంది. అటువంటి సమయంలో నా తల్లి దండ్రులు సహకరించేవారు. పలుమార్లు దాతలు సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. ఇలా సేవ చేయడం నాకు సంతృప్తినిస్తోంది.

–ఎల్లేటి మమత,
మమత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు

'జగనన్న సురక్ష'తో అందరికీ రక్ష



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నాయకులు

అల్లిపురం : జగనన్న సురక్షతో అందరికీ రక్ష అని 33వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంధి గోపికృష్ణ, పార్టీ పార్లమెంటరీ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్ అన్నారు. గౌరీవీధి సచివాలయంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వారు సచివాలయంలో లబ్ధిదారులకు పలు రకాల సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకంలో భాగంగా 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందజేస్తున్నారన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గౌరీవీధి సచివాలయం అడ్మిన్ పీవీ కిరణ్‌కుమార్, కార్యదర్శులు జాన్‌బాబు, షాహిద్, కన్వీనర్లు కొడమంచిలి శ్రీను, వలంటీర్లు కనకగౌరీ, యామినీ, రమణి, గౌష్య, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న సిటు నాయకుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్

దాబాగార్డెన్స్ : గంగవరం పోర్టు కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని అఖిలపక్ష కార్మిక సంఘాలు కోరాయి. సిటు కార్యాలయంలో శనివారం అఖిలపక్ష కార్మిక సంఘం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించింది. సమావేశంలో పాల్గొన్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ నోటీస్ ఎందుకిచ్చారని అడిగినందుకు నాయకుడిని తొలగించడం, షిఫ్ట్ చేంజ్ చేసుకుంటే ఇద్దరు కార్మికులను తొలగించడం, యూనియన్ ఎటువంటి కార్యక్రమాలు చేయబోదని బలవంతంగా సంతకాలు చేయించుకోవడం సరైంది కాదని అఖిలపక్షం అభిప్రాయపడింది. జిల్లా కలెక్టర్ చెప్పిన తర్వాత 29 మంది యూనియన్ నాయకుల డ్యూటీలను అన్యాయంగా ఆపడంపై మండిపడ్డారు. ఇప్పటికే కార్మికులు తమ కుటుంబాలతో రాత్రింబవళ్లు ఆందోళన చేస్తుంటే, మొత్తం కార్మికులకు నోటీసులు పంపుతూ బెదిరింపులకు దిగడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. ఇటువంటి దుర్మార్గపు చర్యలను కార్మిక వర్గం ముక్తకంఠంతో వ్యతిరేకించాలని కోరారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో సిటు ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, టీఎస్‌టీయూసీ అధ్యక్షుడు సక్కా లక్ష్మణరావు, హెచ్‌ఎంఎస్ నాయకుడు దొమ్మేటి అప్పారావు, వైఎస్సార్‌టీయూసీ నాయకుడు బోరా శశిభూషణం, ఇఫ్టూ జిల్లా నాయకుడు కె. మల్లయ్య, ఇంటక్ నాయకుడు శ్యామ్‌శేఖర్, గంగవరం పోర్టు యూనియన్ నాయకుడు బి. జగన్, సీహెచ్ శ్రీనివాసరావు, కె. నాగార్జునరావు, నారాయణ, పి. మణి, వై. తులసి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కోటి శ్రీవిష్ణు సహస్ర నామ పారాయణం



లక్ష తులసి పూజలందుకున్న కృష్ణ భగవానుడు

దాబాగార్డెన్స్ : గీతా ప్రచార సమితి ప్రారంభించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని లోకకల్యాణార్థం నిర్వహించిన కోటి శ్రీవిష్ణు సహస్ర నామ పారాయణం, లక్ష తులసి పూజ శనివారం వేదసభతో ఘనంగా ముగిసింది. బ్రహ్మశ్రీ వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి సారథ్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన వేద పండితులు, ఘనాపాటీలు పాల్గొని చతుర్వేద పారాయణం చేశారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యశాస్త్రి మాట్లాడుతూ దైవానుగ్రహంతోనే కోటి శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం సాంప్రదాయ రీతిన అత్యంత వైభవంగా జరిగిందన్నారు. కార్యక్రమం నిర్వహించిన కమిటీ సభ్యులను ప్రశంసించారు. సంస్థ అధ్యక్షుడు చావలి విశ్వేశ్వరరావు వేదసభలో పాల్గొన్న వేద పండితులను సత్కరించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, సంస్థ గౌరవ అధ్యక్షుడు వై. కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు పి. జగన్‌మోహన్‌రావు, కార్యదర్శి ఎం. వనజాదేవి, కోశాధికారి జీవీఆర్ ప్రసాద్, జి. లక్ష్మీనరసింహ, మహిళా సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు బాధాకరం



పీవీ కిరణ్‌కుమార్

అల్లిపురం : ప్రజలకు విలువైన సేవలు అందిస్తున్న వలంటీర్లపై జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ అనుచిత వాఖ్యలు చేయడం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ పీవీ కిరణ్‌కుమార్, విశాఖ జిల్లా అధ్యక్షుడు పీజే గణేష్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలతో రాష్ట్ర వ్యాప్తంగా సేవలందిస్తున్న వలంటీర్లు మనోవేదనకు గురవుతున్నారన్నారు. దేశానికే ఆదర్శంగా నిలిచిన వలంటీర్ వ్యవస్థను ఎక్కడో జరిగిన ఇబ్బందులను ఆపాదించడం దురదృష్టకరమన్నారు. కలుపు మొక్కలను తొలగించమని చెప్పాలి తప్ప యావత్ వ్యవస్థనే నిందించడం ఆయన మానసిక స్థితికి అద్దం పడుతుందన్నారు. తక్షణమే పవన్ కల్యాణ్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని యూనియన్ జనరల్ సెక్రటరీ రమణ, జిల్లా నాయకులు అశోక్, రాజేష్, శ్యామలరావు, వలంటీర్లు డిమాండ్ చేశారు.

బడుగుల సంక్షేమమే జగనన్న ధ్యేయం



మాట్లాడుతున్న రజక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు విజయలక్ష్మి

దాబాగార్డెన్స్ : బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని రజక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఎలిగాపు విజయలక్ష్మి తెలిపారు. రాష్ట్ర రజక ప్రతినిధుల సమావేశం శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రజా సంక్షేమ సారథి ముఖ్యమంత్రి అని కొనియాడారు. భారతదేశంలోనే ఏ రాష్ట్రం అమలు చేయని సంక్షేమ ఫలాలు.. పథకాలు రూపొందించి అమలు చేయడం గొప్ప విషయమన్నారు. ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు కులాలు, మతాలు, రాజకీయాలకతీతంగా అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ ఫలాలు అందివ్వడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా రజక సంఘం నాయకుడు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ జి. జనార్దన్, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు నడుపూరు ఏసుపాదం, విశాఖ జిల్లా అధ్యక్షుడు కె. సింహాచలం, రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె. దంతేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

108 రథసారథులకు శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డిస్ట్రిక్ట్ ఫ్లీట్ మేనేజర్ జగ్గరాజు

మహారాణిపేట : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ (ఏఇఎంఎస్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 108,104,102 సర్వీసుల్లో పని చేస్తున్న పైలెట్లకు శిక్షణ నిర్వహించింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఆవరణలో జరిగిన ఈ శిక్షణలో భాగంగా కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు వర్షాకాలం నేపథ్యంలో పైలెట్లకు డ్రైవింగ్‌లో మెలకువలు, సిగ్నలింగ్ వ్యవస్థపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఫ్లీట్ మేనేజర్ రవికిరణ్, డిస్ట్రిక్ట్ ఫ్లీట్ మేనేజర్ జగ్గరాజు, డిస్ట్రిక్ట్ మేనేజర్ త్రినాథ్, విశాఖ సిటీ కోఆర్డినేటర్ సురేష్, అనకాపల్లి కోఆర్డినేటర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై బియ్యం, కందిపప్పు విక్రయాలు

సీతమ్మధార: బహిరంగ మార్కెట్‌లో ధరలు పెరగడంతో రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారుల సౌకర్యార్థం సబ్సిడీపై నాణ్యమైన బియ్యం, కందిపప్పు విక్రయిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ తెలిపారు. సీతమ్మధార రైతుబజార్‌లో శనివారం రాయితీపై బియ్యం, కందిపప్పు విక్రయాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు మార్కెట్ ధర బియ్యం కిలో రూ.52 ఉండగా.. రైతుబజార్ కౌంటర్‌లో రూ.46కు, దేశవాళీ కందిపప్పు కిలో రూ.145 కాగా.. రూ.137కు విక్రయిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బియ్యం 80 బస్తాలు, కందిపప్పు మూడు బస్తాలు విక్రయించినట్లు తెలిపారు. ఏఎస్సార్, అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో ఈ క్రాప్ ద్వారా రైతులు పండించే పంటలపై సర్వే చేస్తున్నట్లు తెలిపారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. అలాగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ ఘనంగా జరిగింది. కల్యాణ మండపంలోని వెండి గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టంపజేసి అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు.

అబ్దుల్ కలాం జయంతికి ఆహ్వానం



మిజోరాం గవర్నర్ హరిబాబును సత్కరిస్తున్న కలాం ఫౌండేషన్ ఏపీ బృందం సభ్యులు

మహారాణిపేట : అక్టోబర్ 15న భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబుకు ఆహ్వానం అందింది. ఇంటర్నేషనల్ యునైటెడ్ కలాం ఫౌండేషన్ ఏపీ బృందం శనివారం హరిబాబును కలిసి ఈ ఆహ్వానం అందజేసింది. జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా ఏయూలో జరగనున్న యూత్ కాన్వొకేషన్‌కు ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా గ్రామీణ, జాతీయ వైద్యుల సమస్యలు పరిష్కరించాలని గవర్నర్‌ను కోరారు. ఈ విషయం బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావును కలిసి వివరించాలని, ప్రధాని దృష్టికి ఆయన తీసుకెళతారని తెలిపారు. గవర్నర్‌ను కలిసిన వారిలో బీజేపీ నాయకులు రామ్‌కుమార్, చొక్కాకుల రాంబాబు, జై భీమ్ కన్వీనర్ కోన ప్రకాష్, ఇంటర్నేషనల్ యునైటెడ్ కలాం ఫౌండేషన్ ఏపీ అధ్యక్షుడు ఎం.తిరుపతిరావు, ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జంగం జోషి, ప్రధాన కార్యదర్శి ఎస్.సుగుణేశ్వరి, కోశాధికారి పి.కనకరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కోలాటం కర్రల బహూకరణ

ఏయూక్యాంపస్: స్థానిక 20వ వార్డులోని కేడీపీఎం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రోటరీ క్లబ్ విశాఖ స్మార్ట్ సిటీ సభ్యులు కోలాటం కర్రలను బహూకరించారు. విద్యార్థులు ఆగస్టు 15న కోలాటం ప్రదర్శన ఇవ్వనున్నందున్న వారు నేర్చుకునేందుకు వీలుగా కోలాటం కర్రలను అందించారు. సంస్థ అధ్యక్షుడు వేణు, కార్యనిర్వాహక కార్యదర్శి రవి కుమార్, పాఠశాల హెచ్‌ఎం సుమతీ భాయి పాల్గొన్నారు.

ఘనంగా హెచ్‌పీసీఎల్ ఆవిర్భావ దినోత్సవం



గ్యాస్ సరఫరా బాయ్‌కి మొక్క అందజేస్తున్న మహేష్‌రామ్

సింహాచలం: కరోనా సమయంలో వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్యాస్ సరఫరా చేయడంలో డెలివరీ బాయ్స్ ప్రధాన పాత్ర పోషించారని హెచ్‌పీసీఎల్ ఎల్‌పీజీ సౌత్ సెంట్రల్ జనరల్ మేనేజర్ మహేష్‌రామ్ కొనియాడారు. హెచ్‌పీసీఎల్ 49వ ఆవిర్భావ దినోత్సవాన్ని 94వవార్డు వేపగుంటలోని సత్యమహాలక్ష్మి హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ ప్రాంగణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మహేష్‌రామ్ మాట్లాడుతూ హెచ్‌పీసీఎల్ 49ఏళ్లు పూర్తి చేసుకుని 50వ వసంతంలోకి అడుగుపెట్టిందన్నారు. ఈ సందర్భంగా గ్యాస్ గొడౌన్ ఆవరణలో మొక్కలు నాటారు. డెలివరీ బాయ్స్‌కు మొక్కలు అందజేశారు. ప్రతీ ఒక్కరూ పర్యావరణాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విశాఖ ఎల్‌పీజీ రీజియన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ అన్నవరపు సుందరవదన్, డిప్యూటీ సేల్స్ మేనేజర్ మురళీకృష్ణ, డిప్యూటీ మేనేజర్ (ఆపరేషన్స్) ప్రేమ్‌కుమార్ జ్యోతి, చీఫ్ మేనేజర్ సంజయ్‌కుమార్, ఏరియా సేల్స్ మేనేజర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఫీవర్ సర్వేకు సిద్ధం కండి



మాట్లాడుతున్న అదనపు కమిషనర్ డాక్టర్ సన్యాసిరావు

దాబాగార్డెన్స్: నగరంలో వర్షాలు పడుతున్న దృష్ట్యా సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా దృష్టి సారించాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు ప్రజా ఆరోగ్య సిబ్బంది, అధికారులను ఆదేశించారు. వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో శనివారం నగర పరిధిలోని ఏఎన్‌ఎంలు, మలేరియా సిబ్బంది, హెల్త్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, మలేరియా సిబ్బంది, వలంటీర్లు ప్రతీ శుక్రవారం ఇంటింటికీ వెళ్లి దోమలు వృద్ధి చెందే ప్రదేశాలపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఫీవర్ సర్వే చేయాలని, వ్యాధులు వృద్ధి చెందకుండా ఏఎన్‌ఎంలే బాధ్యత వహించి వార్డుల్లో ఫాగింగ్, స్ప్రేయింగ్ వంటివి చేయించాలన్నారు. డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, డీపీఎంవో డాక్టర్ రామ్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ శశిభూషణ్, జిల్లా మలేరియా అధికారి తులసి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టర్‌కు వినతి



కలెక్టర్ మల్లికార్జునకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

మహారాణిపేట : దేవదాయ శాఖకు సంబంధించి అనేక అంశాలను పరిష్కరించాలని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శనివారం కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునకు వినతిపత్రం సమర్పించారు. 38వ వార్డు ఘోషా హాస్పిటల్ దగ్గర శ్రీ సీతారామ కోవెల స్ట్రీట్ ఏరియాలో గత 50 సంవత్సరాల నుంచి జీవిస్తున్న వారిని ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ శిరీష ఇళ్లు ఖాళీ చేయాలని, లేదంటే నెలసరి అద్దెలు చెల్లించాలని ఆదేశించినట్టు ఎమ్మెల్యే వివరించారు. వారికి పట్టాలు అందజేయాలని, ఎండోమెంట్‌కు వేరే స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. 33వ వార్డులోని వేంకటేశ్వరమెట్ట, 31వ వార్డు ఎల్లమ్మతోటలో నివాస గృహాల సమస్య పరిష్కరించాలని, వేంకటేశ్వర మెట్ట గృహాలకు సంబంధించి 2003లో అప్పటి ఈవో, చైర్మన్, స్థానికుల మధ్య వివాదం కారణంగా రిజిస్ట్రేషన్లు చేయొద్దంటూ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి లేఖ రాయడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచిపోయిందని ఎమ్మెల్యే కలెక్టర్‌కు వివరించారు. మళ్లీ 2018 నుంచి 2021 వరకు 53 గృహాలకు రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. అయితే మళ్లీ దేవదాయ శాఖ అధికారులు మెలిక పెట్టడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మళ్లీ ఆగిపోయిందని చెప్పారు. ఎల్లమ్మ తోట ప్రాంతంలో 90 సంవత్సరాలుగా చాలా కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, వారి ఇళ్లకు సంబంధించి కూడా దేవదాయ శాఖ మెలిక పెట్టిందన్నారు. వెంటనే ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఆయా ప్రాంతాల స్థానికులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, భీశెట్టి శ్రీను, గౌరీ సంఘం అధ్యక్షులు కాండ్రేగుల మంగ, మహిళా అధ్యక్షురాలు శరగడం మోహిని, కార్యదర్శి కోరిబిల్లి త్రినాథ్‌బాబు, కోశాధికారి కోరిబిల్లి దేవరాజు, మాజీ కార్యదర్శి తనకల గోవింద్, బుద్ధా సన్యాసిరాజు, కోరిబిల్లి శ్యామ్, కోరిబిల్లి ఆది, శరగడం కన్నారావు, సూరిశెట్టి శ్రీను, చింతల అప్పారావు, రాపేటి కుమారి, కొడమంచిలి శ్రీను, మహిళా అధ్యక్షురాలు చిన్నమ్మలు, వైసీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.